# లెటర్ బాక్స్

తిమ్మన శ్యామ్ సుందర్ నాయుడు

''అమ్మయ్య! ఇప్పుడొచ్చింది ఇంటికి అసలైన అందం!.....''

కొత్తగా తయారు చేయించిన లెటర్ బాక్సుని ఇంటి గేటుకి తగిలించడానికి దాదాపు అరగంటకు పైగా కుస్తీ పట్టిన మూర్తి, ఆ కార్యక్రమం పూర్తికావడంతో మొహానికి పట్టిన చెమట తుడుచుకుంటూ అనుకున్నాడు.

ఆ లెటర్ బాక్సుని అలాగే చూస్తూ రోడ్డుమీదకి వెళ్ళి అన్ని యాంగిల్స్‌లోనూ చూసి అంతటితో తృప్తి పడక ఆ వీధి చివరిదాకా వెళ్ళి మరీ పరీక్షగా చూశాడు. రోడ్డు చివరి నుంచి కూడా అది ఎంతో అందంగా కొట్టొచ్చినట్లుగా కనబడ్డంతో పూర్తి సాటిస్‌ఫాక్షన్‌తో ఇంటికొచ్చి భార్యని కేకేశాడు.

లోపల్నుంచి వచ్చిన ఆమె కేసి విజయగర్వంతో చూస్తూ, ''ఎలా ఉందోయ్ లెటర్ బాక్సు'' అనడిగాడు.

గేటుకి తగిలుంచున్న లెటర్ బాక్సుని చూస్తూ ఇందుమతి, ''బాగానే ఉందండి. కాని కాస్త పెద్దదైనట్లుగా ఉంది. పైగా అచ్చు గుద్దినట్లు పోస్టుబాక్సులాగా ఉంది'' అంది.

''నేనే కావాలని అలా చేయించాన్లే'' అన్నాడు మూర్తి ఎంతో సంబరంగా

ఈ మధ్యనే మూర్తికి అనుకోకుండా ఓ కోరిక పుట్టింది. అది...ఇంటిగేటుకి ఒక లెటర్ బాక్సుని తగిలించాలని ఇటీవల ఒకసారి ఆఫీసు పని మీద హైదరాబాద్ వెళ్ళినప్పుడు దాదాపు ప్రతి ఇంటి గేటుకి తగిలించబడున్న లెటర్ బాక్సుల్ని గమనించిన అతను వాటిని స్టేటస్ సింబల్స్‌గా భావించాడు. ''పోస్ట్!'' అని పోస్ట్‌మేన్ బయట్నుంచి గట్టిగా అరవడం, ఇంట్లో నుంచి ఎవరో ఒకరు వచ్చేలోపు పోస్ట్‌మేన్ ఆ ఉత్తరాన్ని రెండు వేళ్ళ మధ్యన స్టైల్‌గా ఇరికించుకుని ఇంట్లోకి విసిరికొట్టడం చాలా చిన్నతనంగా అనిపించాయి అతనికి ఆ లెటర్ బాక్సుల్ని చూశాక. లెటర్ బాక్సులున్న ఇళ్ళన్నీ చాలా సంపన్నమైన ఇళ్లని కూడా గ్రహించిన మూర్తి తను కూడా ఒక పెద్ద ఇంటిని అద్దెకు తీసుకుని దాని ముందో లెటర్ బాక్సుని తగిలించి కాస్తంత స్టేటస్‌ని పెంచుకుందామనుకున్నాడు.


బీచ్‌కి వెళ్ళే దార్లో క్రొత్తగా వెలసిన వివేకానంద కాలనీలో అటువంటి ఇల్లు కూడా దొరకడంతో

తన నిర్ణయాన్ని వెంటనే అమలుపరుస్తూ ఆ ఇంట్లో చేరిపోవడమేగాక తను ఎంతో ఇష్టపడి అందంగా తయారు చేయించిన లెటర్ బాక్సుని ఇంటి గేటుకి తగిలించాడు. అప్పటికప్పుడే ఆ లెటర్ బాక్స్ ప్రక్కనే నిలబడి మంచి పోజిచ్చి ఒక ఫోటో కూడా దిగాడు.

తాను ఇల్లు మారిన విషయాన్ని బంధువులందరికీ తెలియజేస్తూ వెంటనే ఉత్తరాలు కూడా వ్రాసేసి ఆ తరువాతి రోజు నుంచే మధ్యాహ్నం పూట లెటర్ బాక్స్ దగ్గర స్టూలు వేస్కుని కూర్చుంటూ ఉత్తరాలకోసం ఎదురు చూడసాగాడు.

★★★

ఎప్పట్లానే ఆ రోజు మధ్యాహ్నం భోజనం అయ్యాక లెటర్ బాక్సు దగ్గర కూర్చున్న మూర్తి, వీధిలోకి ప్రవేశిస్తున్న పోస్ట్‌మేన్ ని చూడ్డంతో పీచు మిఠాయి అమ్మేవాడు వస్తుంటే సంబరపడిపోయే చిన్న పిల్లాడిలా ఎగిరి గంతేశాడు. తనని చూస్తే పోస్ట్‌మాన్ ఉత్తరాల్ని చేతిలో పెడతాడేమోనని అతనికి కనబడకుండా గబగబ ఓ చెట్టు



చాటుకెళ్ళి నక్కాడు.

కాని ఆ పోస్ట్‌మేన్ ఉత్తరాన్ని లెటర్ బాక్స్‌లో వెయ్యకుండా నేరుగా ఇంట్లోకొచ్చి ''పోస్ట్!'' అంటూ లోపలికి విసిరెయ్యడంతో చెప్పలేనంత కోపం వచ్చింది అతనికి. వెంటనే గబగబ బైటకెళ్ళి అతన్ని ఆపి, ''బైట లెటర్ బాక్స్ ఉండగా ఇంట్లోకి లెటర్‌ని ఎందుకు విసిరేశావ్?'' అని తగాదా పెట్టుకున్నంత పని

చేశాడు.

''ఆ లెటర్ బాక్సుని నేను చూళ్ళేదు సార్! ఈసారి నుంచి ఉత్తరాల్ని తప్పకుండా అందులోనే వేస్తాను, నన్నొదిలెయ్యండి'' అంటూ అతను మొర పెట్టుకునే దాకా నానా గోల చేశాడు. పైగా అతని చేతే ఆ ఉత్తరాన్ని లెటర్ బాక్సులో వేయించి మరీ వదిలాడు.

లెటర్ బాక్సుని పోస్ట్‌మేన్‌కి అలా అలవాటు చెయ్యడమే గాకుండా ''ఏమోయ్! ఇల్లు మారావటగా? ఎక్కడ? '' అని ఎవరడిగిని ఇంటి నెంబరు మాత్రం చెప్పకుండా ''వివేకానంద కాలనీలో లెటర్‌బాక్సు ఉన్న ఇల్లే మా ఇల్లు!'' అని అందరికీ చెప్పుకుంటూ కావలసినంత పబ్లిసిటీ తెచ్చుకోవడానికి ప్రయత్నించసాగాడు.

లెటర్ బాక్సు ద్వారా ఉత్తరాల్ని అందుకుంటూ అంతులేని ఆనందాన్ని అనుభవిస్తున్న మూర్తి అచిర కాలంలోనే ''లెటర్ బాక్సు మూర్తి''గా బాగా పాపులర్ అయ్యాడు. ఆ విధంగా స్టేటస్ పెరిగినందుకు, నలుగురిలో తనకో గుర్తింపు వచ్చినందుకు ఎంతో సంబరపడిపోసాగాడు.

అతను ఎంతగా పాపులర్ అయ్యాడంటే కాలనీలో ఎవరిదైనా అడ్రస్ అవసరమైనప్పుడు లెటర్ బాక్స్ మూర్తి ప్రక్కిల్లు, వెనకిల్లు, లేదంటే లెటర్ బాక్స్ మూర్తింటి ఆ ప్రక్క సందు, ఈ ప్రక్క బజారు అని అందరూ చెప్పుకునేంతగా పాపులర్ అయ్యాడు. అలా పాపులర్ కావడానికి తనే స్వయంగా పబ్లిసిటీ డిజైన్ చేసుకున్నాడు.

లెటర్ బాక్సు తాళాన్ని తనే స్వయంగా ఓపెన్ చేసి తృప్తిపడే మూర్తి, ఆ తాళాన్ని తన భార్యకి కూడా ఇచ్చేవాడు కాదు.

ఆ విధంగా ఎనలేని గుర్తింపును పొందిన మూర్తి జీవితంలో ఓ రోజు అనుకోని సంఘటన ఎదురయ్యింది...

ఎప్పట్లానే ఆ రోజు మధ్యాహ్నం లెటర్ బాక్స్ తెరిచిన మూర్తికి అందులో ఇన్‌లాండ్ కవర్ కనబడ్డంతో బైటికి తీసి చూశాడు. ఆ ఉత్తరం తన భార్య ఇందుమతికి కావడంతో ''ఎవ్రరాశారబ్బా??'' అనుకుంటూ కవర్ మధ్యలో చూపుడు వ్రేలు పెట్టి వెడల్పు చేసి చూశాడు. ఉత్తరం చివర్న ''ప్రేమతో నీ మధు'' అన్న ముగింపు ఉండడంతో బిత్తరపోయాడు. ఆ ఉత్తరంలోని సారాంశాన్ని అలానే తలకాయ లోపల పెట్టినంత పన్జేసి చదివిన మూర్తికి బుర్ర తిరిగినట్లవ్వడంతో గబగబ ఉత్తరం మొత్తం ఓపెన్ చేసి చదివాడు.

''వచ్చే మంగళవారం సాయంత్రం ఎప్పట్లానే ఆంజనేయ స్వామి గుళ్ళో నీ కోసం ఎదురు చూస్తూ ఉంటాను.'' అన్న చిట్ట చివరి వ్యాక్యాన్ని మరీ మరీ చదివిన మూర్తికి మూర్ఛవచ్చినంత పనయ్యింది. భార్య మీద కోపం వచ్చింది. ఆ ఉత్తరాన్ని కసికసిగా ముక్కలు ముక్కలు చేశాడు.

''ఎవరీ మధు'' అనుకుంటూ మంచం మీద పడుకుని ఆ రాత్రంతా తీవ్రంగా ఆలోచించాడు.

రోజూ ఇంటికొచ్చే మగ పురుగులు ఇద్దరే ఉన్నారు. ఒకడు పాలవాడు, రెండవ వ్యక్తి పోస్ట్‌మేన్. కాని ఇద్దరి పేర్లు అంత అందమైనవేం కావు. ''ఒకవేళ వాళ్ళిద్దర్లో ఎవరైనా పేరు మార్చుకుని?...'' అనుమానం రావడంతో ఆ తరువాత రోజు ఉదయమే

పాలవాడితో ''రేపట్నుంచి పాలు నువ్వు తీసుకు రాకు వీరయ్యా!'' అన్నాడు.

వీరయ్య కంగారుపడి, ''అదేంది బాబయ్యా అట్టా అన్నారు.? పాలు బాగోలేదా? ఇంకాస్త సిక్కగా పోత్తాన్లెండి'' అన్నాడు.

''పలచగా పోసినా చిక్కగాపోసినా నువ్వు మాత్రం తీసుకురావద్దు. రేపట్నుంచి మీ ఆవిణ్ణే పంపించు'' అన్న అతని మాటకి మరిగిన పాలలా అయ్యాడు వీరయ్య.

వెంటనే అతని మీద విరుచుకుపడి, ''ఏం సామీ! నా పెళ్ళామొచ్చిపొయ్యాలా? ఏం? నేను పనికి రానా? ఇంట్లో సక్కని అమ్మగారు ఉండంగా ఊళ్ళో ఆడోళ్లు కావాల్సొచ్చారా నీకు?'' అని ఎడాపెడా వాయించడమేగాక ఆ రోజు నుంచి పాలు పొయ్యడమే మానేశాడు. పైగా మరెవర్నీ పొయ్యనియ్యకుండా కూడా చేశాడు. ఆ దెబ్బతో రోజూ గంటల తరబడి మిల్క్‌వ్యాన్ క్యూలో నిలబడి పాలు తెచ్చుకోవలసిన అగత్యం ఏర్పడ్డంతో డీలా పడిపోయాడు మూర్తి. ఆ అనుభవంతో పోస్ట్‌మేన్ మీద అటువంటి ప్రయోగం చేద్దామనుకున్న ప్రయత్నాన్ని విరమించు కున్నాడు.

''రోజూ ఎందుకండీ అలా గంటల తరబడి లెటర్ బాక్స్ దగ్గిర కూర్చోవడం. ఆ ఉత్తరాల్ని నేను జాగ్రత్త చేస్తాను కదా! సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన తరువాత వాటిని చదువుకోకూడదా ఏంటి? దాని తాళం ఇటివ్వండి.'' అని లెటర్ బాక్స్ అమర్చిన క్రొత్తలో ఇందుమతి ఆ బాక్సు తాళాన్ని అడిగిన విషయం గుర్తుకొచ్చింది మూర్తికి.

''అంటే తన ప్రియుడు వ్రాసే ఉత్తరాల్ని దాచుకోడానికే ఆ తాళాన్ని అడిగింద న్నమాట! ఎంత నంగనాచి! ఈ లెక్కన పాతింట్లో ఉన్నప్పుడు కూడా ఆమెకి ఉత్తరాలు వచ్చే ఉంటాయి. అప్పుడంటే ఆఫీసులోనే ఉండేవాణ్ణి కాబట్టి నాకా విషయం తెలీలేదు. ఇప్పుడీ లెటర్ బాక్స్ వల్ల వీళ్ళ విషయం బయటపడింది. ముందు ఆ మధుగాడ్ని పట్టుకోవాలి. వాణ్ణి పట్టు కోవాలంటే మంగళవారం సాయంత్రం తప్పనిసరిగా గుడికెళ్ళాలి...'' అని మనసులోనే నిశ్చయించుకున్న మూర్తి ఆ రోజు కోసం మరో నాలుగు రోజుల పాటు చాలా అసహనంగా ఎదురు చూశాడు.

మంగళవారం రాగానే సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికొచ్చి 'ఇందూ! త్వరగా తయారవ్. ఆంజనేయ స్వామి గుడి కెళ్ళొద్దాం!'' అన్నాడు.

''గుడికా?'' అంది ఇందుమతి ఆశ్చర్యంగా

## తుపాను

''ఏం రాజ్యలక్ష్మి, ఇన్నేళ్ల తర్వాత నువ్వు నెలతప్పావటగా... ఎలా జరిగింది'' అడిగింది రామలక్ష్మి.

తుపాన్ వచ్చినప్పుడు మూడు రోజులు కరెంట్ పోయింది కదా. ఆ తర్వాత కొన్నాళ్లకు వాంతులయ్యాయి... అంతే'' అమాయకంగా చెప్పింది రాజ్యలక్ష్మి.

- చిలకంటి బాబూరావురత్న
(మల్లికల్)

ఎప్పుడూ గుడి ఊసే ఎత్తని భర్తతో.

''ఎందుకో ఈరోజు మనమిద్దరం కాసేపు గుళ్ళో గడిపితే బాగుంటుందని పిస్తోందోయ్ నాకు'' అన్న అతని జవాబుకు చకచకా తయారయ్యింది ఆమె.

గుడి ముందు స్కూటర్ ఆపిన మూర్తి, ''నువ్వు దర్శనానికి పద. నేను ఆ అరుగుమీద కూర్చుంటాను.'' అన్నాడు ఆ వైపు అడుగులేస్తూ.

ఆమె లోపలికి వెళ్ళగానే ఆ చుట్టుప్రక్కల పరిసరాల్ని గమనించసాగాడు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భార్యని కలుసుకోవడానికి ఎవరన్నా ప్రయత్నిస్తారేమోనని ఆమె మీద కన్నేసి ఉంచాడు. ఎందుకైనా మంచిదని తను కూడా గుడి చుట్టూ రివర్స్ డైరెక్షన్‌లో మూడు ప్రదక్షిణలు కూడా చేశాడు.

తీర్థ ప్రసాదాలు తీసుకుని అక్కడే మరికొంతసేపు గడిపినా తనకు అనుమానం కలిగించే సంఘటన ఏదీ జరక్కపోవటంతో ''ఒక వేళ నేను రావడం దూరం నుంచే గమనించిన వాడు మెల్లిగా జారుకున్నాడేమో! మరో ఉత్తరం వ్రాయక పోతాడా, అప్పుడైనా వాన్ని పట్టుకోక పోతానా''... అనుకుంటూ అక్కణ్ణుంచి లేచాడు.


కాని ఆ తరువాత తనూహించినట్లుగా ఆమెకు ఒక్క ఉత్తరం కూడా రాకపోవడంతో అతనింక సరాసరి ఇంటికొచ్చే ప్లాన్‌లోనే ఉన్నాడని నిర్ధారించుకుని అతని రాక కోసం, అతనెవరో తెలుసుకోవడం కోసం ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టాడు. తన ఇన్వెస్టిగేషన్‌కు ''ఆపరేషన్ మూర్తి'' అని పేరు పెట్టుకున్నాడు. తన పరిశోధనకు అనువైన స్థలంగా తన ఇంటికి రెండిళ్ళ అవతలున్న కిళ్ళీ బంకును ఎంచుకున్నాడు. భార్యకు తెలీకుండా ఆఫీసుకి సెలవు పెట్టి మరీ ఆ బంకు చాటు నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి రోజూ అతని రాకకోసం గమనించ సాగాడు.

భార్యతో మాట్లాడ్డం బాగా తగ్గించాడు. ప్రపంచంలో ఏ ఆడదాన్నీ నమ్మకూడదనే నిర్ణయానికొచ్చేశాడు. తనకొచ్చిన కష్టాన్ని తట్టుకోలేక బావురుమని ఏడుద్దామను కున్నాడు. కాని ఎవరన్నా చూస్తే ''షేమ్ షేమ్'' అంటారేమోనని ఏడుపును బల వంతంగా దిగమింగుకున్నాడు.

కొన్ని రోజుల క్రితం వరకు ''ఏమోయ్ లెటర్ బాక్స్ మూర్తీ!'' అని ఎవరు పలకరించినా పులకించి పోయిన మూర్తి ఇప్పుడెవరన్నా అలా పిలిస్తే చిరాకు పడిపోసాగాడు.

నెమ్మదిగా రోజులు గడుస్తుండగా పెట్టుకున్న సిక్ లీవ్ ఐపోతుండటంతో తను నిజంగానే సిక్ కాసాగాడు.

కాని ఆ మధు అనే వాడెవడో దొరికితేనేగాని తనకింత మనశ్శాంతి దొరకదని ఎంతో కృత నిశ్చయంతో కిళ్ళీ బంకు చాటు నుంచి తన పరిశోధనను కొనసాగిస్తున్న మూర్తికి ఒక రోజు ఉదయం పది గంటలకు తన ఇంటి ముందు తచ్చాడుతున్న ఓ ఎనిమిదేళ్ళ పిల్లాడు కనబడ్డంతో వాడి కేసి చాలా కేర్‌ఫుల్‌గా చూశాడు. వాడు అటు ఇటు దిక్కులు చూడ్డం, తన ఇంట్లోకి తిరిగి చూడ్డం లాంటివి చేస్తుండడంతో మూర్తి అనుమానం వాడి మీదకి మళ్ళింది.




''సందేహం లేదు. వీడే మధు. వీణ్ణెలాగైనా పట్టుకోవాలి'' అనుకుని అక్కణ్ణుంచి కదలబోయి, ''ఛ! పిల్ల వెధవ. వీడు ఉత్తరం వ్రాయడమేంటి? ఇందు వీణ్ణి ప్రేమించడమేంటి?'' అంటూ తన బుద్ధి మాంద్యానికి తననే నిందించుకున్నాడు.

ఐతే ఆ పిల్లాడు తన లాగు జేబులోనుంచి ఒక కవర్‌ని తీసి, చాలా స్పీడ్‌గా దాన్ని లెటర్ బాక్సులో పడేసి వెంటనే వెనక్కి పరుగు లంకించుకోవడంతో హతాశుడయ్యాడు మూర్తి. పిచ్చి ఆవేశంతో వాడి వెంట పడ్డాడు.

తనని ఎవరో తరుముకు వస్తున్నట్లు వెంటనే గమనించిన ఆ పిల్లాడు భయంతో పరుగులో మరింత వేగం పెంచడంతో రెచ్చిపోయిన మూర్తి, ఒళ్ళంతా బిగపెట్టి మరీ వాడి వెంట పడసాగాడు. కాని ఆ బుడతడు మూర్తికి చిక్కకుండా ఆ పరిసరంలోనే గబగబ నాలుగైదు సందులు తిరిగాడు.

వీళ్ళ పరుగులు డిస్టర్బెన్స్‌గా అనిపించాయేమో అప్పటిదాకా ప్రశాంతంగా కునుకు తీసిన ఆ వీధి కుక్క ''ఏంటి మీ న్యూసెన్స్?'' అన్నట్లు భయంకరంగా మొరుగుతూ మూర్తి వెంటబడ్డంతో బెంబేలెత్తిపోయిన మూర్తి, ఒక్కసారిగా గట్టిగా కేకేసి పిక్కల్లోకి ప్రాణాలు తెచ్చుకుని మరింత స్పీడ్‌గా పరిగెత్తసాగాడు. కొంత దూరం వెంబడించి ఆ శునకం ఆగిపోయినా అది కరుస్తుందేమోనన్న భయంతో వేగం పెంచిన మూర్తి దాని పుణ్యమాని ఆ బుడతణ్ణి తేలిగ్గా అందుకోగలిగాడు.

వెంటనే వాడి వీపు మీద ఒకటి చరిచి, చెవిని గట్టిగా మెలిదిప్పి, ''చెప్పరా! ఆ ఉత్తరాన్ని నీకెవరిచ్చారు?'' అనడిగాడు వగరుస్తూ.

వాడు మేక పిల్లలాగా అరిచి, '' ఆ మేడ మీద అంకుల్!'' అన్నాడు చేయి చూపిస్తూ.

''వాడి పేరు మధు కదూ?'' అనడిగిన మూర్తితో వాడు ఔననడంతో ఆ బుడతణ్ణి అలాగే పట్టుకుని మేడెక్కి గట్టిగా కేకేశాడు.

ఆ కేకకి బైటికొచ్చిన మధు మూర్తికేసి

ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఏంటి నువ్వు చేస్తున్న పని?'' చాలా కోపంగా అడిగాడు మూర్తి.

''షేవింగ్!'' అన్నాడతను రేజర్‌లోకి బ్లేడుని ఎక్కిస్తూ.

''ఛత్! నేనడిగింది అది కాదు. ఈ పిల్ల వెధవ చేత ఉత్తరాలెందుకు పంపిస్తున్నావని?''

ఆ ప్రశ్నకు గతుక్కుమన్న మధు దొరికి పోయినట్లుగా బిత్తరచూపులు చూశాడు.

''నిన్నిప్పుడే-పోలీసులకి పట్టిస్తానుండు. పోలీస్! పోలీస్!'' అని బిగ్గరగా అరిచాడు మూర్తి.

వాళ్ళెవరూ దరిదాపుల్లో లేకపోవడంతో ''చూడూ! పొరపాటై పోయింది. మరోసారిలా ఉత్తరాలు వ్రాయను అని వైట్ పేపర్ మీద వ్రాసి సంతకం పెట్టివ్వు. లేదంటే నీ బ్రతుకు పోలీస్‌స్టేషన్లో...''

''ఆ! ఏం చేస్తారండీ? మహా ఐతే చితగ్గొడతారు. అంతేగా? కొట్టనివ్వండి. నాకేమన్నా భయమా? ప్రేమికులు పిరికి వాళ్ళు కారాదంటారు. నేనూ వాళ్ళకి ధైర్యంగా చెప్పేస్తాను ఇందుమతిని గాఢంగా ప్రేమిస్తు న్నానని.'' అన్నాడు ఎంతో ఆవేశంగా అతను వెంటనే.

భయపడతాడనుకున్న వ్యక్తి తిరగబడ్డంతో బిత్తరపోయాడు మూర్తి. పైగా తన భార్యని అతను ప్రేమిస్తున్నాననడంతో షాక్ కొట్టినట్లుగా అయ్యాడు. అతని తెగువకి కళ్ళు బైర్లు కమ్మినట్లై తూలి క్రింద పడబోయి నిలదొక్కుకుని ''నీకిదేం పొయ్యేకాలంరా నా భార్యని ప్రేమిస్తున్నానంటావ్?'' అన్నాడు నీరసంగా.

''నీ భార్యేంటి నాన్సెన్స్. ఇందుమతిని నేను పెళ్ళి చేసుకోబోతుంటేనూ?...''

''ఒరేయ్! మళ్ళీ అదే మాట! ఇందుమతి నా భార్యరా!...

అప్పుడో ఇప్పుడో వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి మూర్తి కళ్ళు.

''జోకెయ్యకు. నేను ప్రేమించిన అమ్మాయి తో నీకు పెళ్ళవ్వడమేంటి?'' చిరాగ్గా అన్నాడు మధు.

ఈసారి జుట్టు పీక్కోబోయి ఆగిపోయాడు మూర్తి. అదసలే పల్చని జుట్టు కావడంతో ఊడొస్తుందన్న భయంతో.

''అసలిదంతా నీ వల్లనే జరిగిందిరా బడుద్ధాయ్! ఉత్తరాన్ని ఎవరూ చూడకుండా జాగ్రత్తగా పోస్ట్ చెయ్యరా అనిస్తే అందరూ చూసేటట్లుగా చేస్తావా?'' అంటూ ఆ పిల్లాడి నెత్తిమీద ఒక్కటేసాడు మధు.

''ఏంటంకుల్? పోస్లే కదాని హెల్ప్ చేస్తుంటే నన్ను కొడతావేం? ఉత్తరాన్ని పోస్ట్ చేస్తుండగా ఈ అంకుల్ చూసినట్లున్నాడు, వెంటబడి పట్టుకుని మరీ వాయించాడు. నీ వల్ల నేను అనవసరంగా తన్నులు తిన్నాను.'' అన్నాడు ఆ పిల్లాడు బుంగ మూతి పెట్టి నెత్తి మీద రుద్దుకుంటూ.

''అసలు వీడు ఇందుమతికే లెటర్ పోస్ట్ చేస్తున్నట్లు మీకెందు కనుమానం వచ్చింది?'' అడిగాడు మధు మూర్తిని.

''ఎందుకేంటి నీ తలకాయ్? వాడు ఆ ఉత్తరాన్ని మా లెటర్ బాక్సులో వేస్తుంటే నేను కళ్ళారా చూస్తేనూ...''

క్షణంలో అయోమయంలో పడిన మధు ''లెటర్ బాక్సా? లెటర్ బాక్సేంటి? పోస్ట్

బాక్సు కదూ?!...'' అడిగాడు.

''లెటర్ బాక్సంటే మళ్ళీ పోస్ట్ బాక్స్ అంటావేం?'' చిరాకు పడ్డాడు మూర్తి.

ఐతే ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందని గ్రహించిన మధు వెంటనే, ''రేయ్ డుంబూ! ఆ ఉత్తరాన్ని ఎక్కడ పోస్ట్ చేసావురా నువ్వు?'' అనడిగాడు.

''ఇదిగో! ఈ అంకుల్ వాళ్ళ ఇంటి గేటుకి ఉందిగా పెద్ద పోస్ట్ బాక్సు. పోస్టాఫీసుదాకా వెళ్ళడం దేనికని అందులో వేసేశాను. పోయినసారి కూడా దాన్లోనే వేశాను.'' అని డుంబుగాడు సమాధానమివ్వడంతో విషయం మొత్తం అర్థమైన మధు ఒక్కసారిగా ఫెళ్ళున నవ్వాడు. క్రిందపడి పొర్లి పొర్లి మరీ నవ్వాడు.

అతనంతగా ఓవర్‌గా ఎందుకు నవ్వుతున్నాడో అర్థం కాని మూర్తి ''ఏంటానవ్వు?'' అన్నాడు చిరాగ్గా.

''ఇప్పుడు విషయమంతా నా కర్థమయ్యింది. చెబుతానుండండి..ఈ డుంబుగాడ్ని లెటర్ పోస్ట్ చెయ్యరా అనిస్తే వాడు పోస్ట్ బాక్సు అనుకుని, మీ లెటర్ బాక్సులో దాన్ని వేశాడు. దాన్ని చూసి మీరు కంగారుపడి...బైదిబై మీ భార్య పేరు ఇందుమతా?'' అనడిగాడు మధు.

మూర్తి ఔనని తలూపడంతో ''మీ భార్యకొచ్చిన ఉత్తరమే కదాని మీరు దాని మీద అడ్రస్సైనా చూడకుండా చదివేసినట్లున్నారు. నా ప్రియురాలి పేరు కూడా ఇందుమతే కావడంతో మీరు పప్పులో కాలేశారు.....''

మధు చెప్పేది వింటూ బొమ్మలా నిలబడిపోయాడు మూర్తి. ''ఆ ఉత్తరంలో ఎప్పట్లానే ఆంజనేయ స్వామి గుడికి రమ్మని మని వ్రాశాను. ఎందుకంటే మేమెప్పుడూ కలుసుకునేది ఆ గుళ్ళోనే కాబట్టి. కాని నేను గుడికెళ్ళినా ఆమె రాక పోవటంతో అప్పుడు కారణం అర్థం కాలేదు నాకు. ఆ ఉత్తరం అప్పుడామెకి చేరలేదని ఇప్పుడర్థమయ్యింది.'' అన్నాడు మళ్ళీ పడీ పడీ నవ్వుతూ.

ఏం జరిగిందో అర్థం కావడానికి కాస్త సమయం పట్టింది మూర్తికి.

''అంటే..పోస్ట్ బాక్సుకీ, లెటర్ బాక్సుకీ తేడా తెలీని పిల్ల సన్నాసి వల్ల ఇన్ని అవస్థలు పడ్డానన్న మాట. లెటర్ బాక్సుని చూసి, దాన్నే పోస్ట్‌బాక్స్ అనుకుని అందులో ఉత్తరాన్ని వేసిన బుడతడు ఇంతలోనే ఎంత వైరాగ్యం తెచ్చిపెట్టాడు?..''

ఒక్కసారిగా గట్టిగా తల విదిలించాడు మూర్తి. ''ఐనా నేను చేసింది మాత్రం తప్పు కాదూ? లెటర్ మీద అడ్రస్ సరిగ్గా చూడకుండా ఉత్తరం మొత్తం చదవడమేంటి? ఒకవేళ చదివినా బంగారం లాంటి భార్యని అనుమానించడమేంటి? ఛ!ఛ!'' అనుకుంటూ, తనలో తనే ప్రశ్నించు కుంటూ, పశ్చాత్తాప పడుతూ ఇన్ని రోజుల పాటు భార్యని అనుమానించినందుకు నెత్తి మీద ఓ జెల్లకాయ కొట్టుకుని మరీ ఇంటికి కదిలాడు. గేటు తెరుస్తూ దానికి తగిలుంచున్న లెటర్ బాక్సుని చూసి, అది అచ్చం పోస్ట్ బాక్సులా ఉండడంతో తనలో తనే నవ్వుకున్నాడు.

ఇంట్లోకి వెళ్ళి ప్రేమగా ''ఇందూ!'' అని పిలిచాడు. ''వస్తున్నా!'' అంటూ అర్ధం ముందు నుంచి వచ్చిన ఆమెను దగ్గరకి తీసుకుంటూ ఈరోజు నాకు చాలా ఆనందంగా ఉందోయ్!'' అన్నాడు.

''ఎందుకు?'' అంది ఇందు.

''ఇందుకు?''అన్నాడు లెటర్ బాక్సు తాళాన్ని ఆమె చేతిలో పెడుతూ.

★